క్లుప్తంగా

నేడు నాగుల చవితికి విస్తృత ఏర్పాట్లు



పొన్నూరు: మండల పరిధిలోని కట్టెంపూడి శివారులోని నాగేంద్రస్వామి దేవస్థానం(పుట్ట) మంగళవారం నాగుల చవితి వేడుకకు ముస్తాబయింది. ఆలయ ప్రాంగణంలో నాగేంద్రస్వామికి పాలు సమర్పించుకునేందుకు సహజ సిద్ధంగా పుట్టలు వెలిశాయి. ఎంతో ప్రత్యేకత కలిగిన వృక్షాలు ఉండటంతో ఆలయానికి వచ్చిన వారంతా ఇక్కడ కొద్దిసేపు సేద దీరేందుకు ఆసక్తి కనబరుస్తారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో సభ్యుల సహకారంతో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు. విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. విశేష సంఖ్యలో పాల్గొనే భక్తులకు అన్నదాన కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తులకు అసౌకర్యం కలుగకుండా బారికేడ్లు, షామియానాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఓ నిడమానూరి శ్రీనివాస్ తెలిపారు.

ఉరివేసుకుని వివాహిత ఆత్మహత్య




ప్రత్తిపాడు: ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. ఒడిశా రాష్ట్రం కటక్ జిల్లా రగడిపాట్నా గ్రామానికి చెందిన హేమలత రాణా, ప్రభాకర్‌లకు చెందిన మూడో కుమార్తె సంజుక్త నాయక్‌కు దీపునాయక్‌తో ఆరేళ్ల కిందట వివాహం అయింది. వీరికి కుమార్తె రుద్రాణి, కుమారుడు రుద్రో ఉన్నారు. భార్యాభర్తలిద్దరూ రెండు నెలలుగా ప్రత్తిపాడు మండలం చినకోండ్రుపాడులోని జీబీటీఎల్ లిమిటెడ్ స్పిన్నింగ్ మిల్లులో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. సంజుక్త ఇటీవల తరచుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. బాధను చూసి తట్టుకోలేని తల్లిదండ్రులు పనులు వద్దని, స్వగ్రామానికి వెళ్లమని సూచించారు. అయినా వినకుండా సంజుక్త భర్తతో పాటే ఉంటూ పనులకు వెళ్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీ సాయంత్రం భరించలేని విధంగా కడుపునొప్పి రావడంతో భర్త, ఇద్దరు పిల్లలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో చీరతో ఉరివేసుకుంది. గమనించిన దీపునాయక్ స్థానికుల సాయంతో కిందకు దించి ఆటోలో స్థానిక కాటూరి ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లాలని సూచించారు. దీంతో గుంటూరు జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు తల్లి హేమలతరాణా ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె. నాగేంద్ర తెలిపారు.

రైతులకు లింగాకర్షక బుట్టల పంపిణీ



గుంటూరు రూరల్: పత్తి పంటలో గులాబీరంగు పురుగుల నివారణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని బాపట్ల వ్యవసాయ కళాశాలల విద్యార్థులు సూచించారు. సోమవారం మండలంలోని జొన్నలగడ్డలో సమగ్ర పురుగుల నియంత్రణ, యాజమాన్య పద్ధతులపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు రైతులకు అవగాహన కల్పించారు. రైతు వంగా నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో రైతులకు ఉచితంగా లింగాకర్షక బుట్టలు, పసుపు రంగు, నీలి రంగు జిగురు అట్టలు పంపిణీ చేసి పొలంలో అమర్చే విధానం, వాటి ఉపయోగాలు వివరించారు. రైతులు పురుగు నివారణ మందులకు వెచ్చించే అధిక పెట్టుబడులు తగ్గించుకొవచ్చని తెలిపారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రోచిష్మతి గోల్డ్‌మెడల్



పెదకాకాని: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బిత్రా రోచిష్మతి గోల్డ్‌మెడల్ సాధించింది. గుంటూరు జిల్లా తెనాలిలో మూడు రోజులు పాటు నిర్వహించిన స్కూల్ గేమ్స్ అండర్– 17 విభాగంలో మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న రోచిష్మతి పాల్గొని సత్తా చాటింది. గోల్డ్‌మెడల్ సాధించిన రోచిష్మతి డిసెంబరులో మణిపూర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు నుంచిపాల్గొంటుందని పాఠశాల వ్యాయామోపాధ్యాయుడు వినయ్‌కుమార్ తెలిపారు.

సగం మంది లైన్‌మెన్లు లేక..

- పోస్టుల సంఖ్య 21
- ప్రస్తుతం పనిచేస్తున్న వారు 11
- పనిభారంతో అల్లాడుతున్న లైన్‌మెన్లు
- సేవల్లో కొంత జాప్యం



విధులు నిర్వర్తిస్తున్న లైన్‌మెన్(ఫైల్)



ఇటీవల అర్ధరాత్రి సమయంలో రావిపాటివారిపాలెంలో విద్యుత్ పోల్‌పై వస్తున్న మంటలు

ప్రత్తిపాడు: ఇక్కడ కనిపిస్తున్న ఈ చిత్రం రావిపాటివారిపాలెంలోనిది. అర్ధరాత్రి వేళ ఆకస్మాత్తుగా విద్యుత్ పోల్‌పై ఎల్‌టీ జంపర్ కట్ అవ్వడంతో మంటలు చెలరేగాయి. అక్కడ లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉండటంతో పక్క గ్రామం నుంచి లైన్‌మెన్ వచ్చి సమస్యను పరిష్కరించేందుకు కొంత సమయం గడిచింది. అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు. కానీ సరిపడినంత మంది సిబ్బంది లేకపోవడంతో మండలంలో అక్కడక్కడ ఉత్పన్నమవుతున్న ఇలాంటి సమస్యలను వేగంగా పరిష్కరించడంలో కొంత జాప్యం జరుగుతుంది. పక్క గ్రామాల నుంచి సిబ్బంది వెళ్లి మరమ్మతులు చేసేలోపల పొరబాటున ఏమైనా ప్రమాదం జరిగితే.. ఊహించడమే కష్టం.

సిబ్బంది ఇలా..

ప్రత్తిపాడు విద్యుత్ సబ్ స్టేషను పరిధిలో మొత్తం పదహారు గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో విద్యుత్ సేవలు అందించేందుకు ముగ్గురు లైన్‌మెన్‌లు, పది మంది అసిస్టెంట్ లైన్‌మెన్లు, ఎనిమిది మంది జూనియర్ లైన్‌మెన్లు చొప్పున మొత్తం 21 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ ముగ్గురు లైన్‌మెన్లుకు ముగ్గురు ఉండగా, పదిమంది ఏఎల్‌ఎంలకు గాను కేవలం నలుగురే ఉన్నారు. అదే విధంగా ఎనిమిది మంది జేఎల్‌ఎంలకు గాను నలుగురే సిబ్బంది ఉన్నారు. అంటే 21 మంది సిబ్బందికి గాను 11 మందే విధుల్లో ఉన్నారు. పది మంది కొరత ఉండటంతో ఉన్న వారితోనే నెట్టుకురావాల్సిన పరిస్థితి చోటుచేసుకుంటుంది. మండలంలో మొత్తం 18,000 విద్యుత్ సర్వీసులున్నాయి. వాటిలో ఇళ్ల సర్వీసులు 12,000 ఉండగా, వ్యాపార సర్వీసులు 4,000, ప్రభుత్వ సర్వీసులు సుమారు రెండు వేల వరకు ఉన్నాయి.

ఒక్కో లైన్‌మెన్‌కు నాలుగైదు గ్రామాలు..

సిబ్బంది కొరతతో ఒక్కో లైన్‌మెన్ నాలుగైదు గ్రామాలను అధికారులు కేటాయించారు. ఆయా గ్రామాల్లో ఏ చిన్న సమస్య తలెత్తినా సదరు సిబ్బంది పక్క గ్రామాలకు పరుగులు పెట్టాల్సి వస్తుంది. పనిభారం అధికమవుతున్నప్పటికీ ఎమర్జెన్సీ సర్వీసు కావడంతో అదనపు విధులను కష్టంగా నిర్వర్తించాల్సి వస్తుందని లైన్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి డిస్ట్రిబ్యూషన్ ప్రకారం ఉండాల్సిన సిబ్బంది లేకపోవడంతో సేవల్లో జాప్యం తప్పడంలేదు.

- నడింపాలెం లైన్‌మెన్ యుగేశ్వరరావు చినకోండ్రుపాడుతో పాటు రావిపాటివారిపాలెం, ఈదులపాలెం, తుమ్మలపాలెం, కొండజాగర్లమూడి, బోయపాలెం గ్రామాలను అప్పగించారు.
- నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో ఐదు వేలకు పైగా విద్యుత్ సర్వీసులున్నాయి. వీటికి గాను ఆరుగురు వరకు సిబ్బంది ఉండాలి. కానీ ఆరుగురి బాధ్యతలను ఇద్దరే లైన్‌మెన్లు కొండలరావు, శరత్ కుమార్ నిర్వర్తిస్తున్నారు. ఇది వారికి తలకు మించిన భారంగా తయారయ్యింది.
- పాతమల్లాయపాలెం గ్రేడ్–2 జేఎల్‌ఎం అనిల్‌కు పాతమల్లాయపాలెంతో పాటు మేడావారిపాలెం, కొత్తమల్లాయపాలెం గ్రామాల బాధ్యతలను కూడా అప్పగించారు. దీంతో అతనిపైనా అదనపు పనిభారం పడుతుంది.

ఉన్నతాధికారులకు నివేదించాం



లైన్‌మెన్లు కొరత ఉన్న మాట వాస్తవమే. ఇప్పటికే విషయాన్ని ఉన్నతాధికారులకు లిఖితపూర్వకంగా నివేదించాం. సానుకూలంగా స్పందించారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఎక్కడా ఏ సమస్యా లేకుండా విధులను నిర్వర్తిస్తున్నాం. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాం. లైన్‌మెన్ లేని గ్రామాలకు పక్క గ్రామాల నుండి లైన్ మెన్‌ను పంపి సమస్యను పరిష్కరిస్తున్నాం. ప్రజలు, వినియోగదారులు అర్థం చేసుకుని సహకరించాలి.

– టి.గౌతమ్, ఏఈ, విద్యుత్ సబ్ స్టేషన్, ప్రత్తిపాడు



మరుగున పడి

పొన్నూరు: స్వచ్ఛ పొన్నూరులో భాగంగా బహిరంగంగా మల, మూత్ర, విసర్జన నిషేధానికి పట్టణంలోని నిడుబ్రోలు వంతెన, 9వ వార్డులో మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. నిర్మాణంలో చూపిన శ్రద్ధ వినియోగంలోకి తీసుకురావడంలో చూపకపోవడంతో అవన్నీ ప్రస్తుతం మరుగున పడ్డాయి. లక్షలాది రూపాయలతో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.

రేషన్ బియ్యం పట్టివేత

గుంటూరు రూరల్: రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాన్ని నగరంలో విజిలెన్స్ అధికారులు సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ప్రత్తిపాడు నుంచి కాకినాడకు అక్రమంగా తరలిస్తున్న 130 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వాహనంతో పాటు స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. ప్రత్తిపాడులో ఒక రైస్‌మిల్లు నుంచి అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారంతో రెక్కి నిర్వహించి అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రోడ్లు, డ్రెయిన్లపై ఆక్రమణలను తొలగించాలని, ఆక్రమణలు పునరావృతమైతే సంబంధిత వార్డు సచివాలయ ప్లానింగ్, శానిటేషన్ కార్యదర్శులదే బాధ్యత అని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం కమిషనర్ అమరావతి రోడ్‌లో ఆక్రమణల తొలగింపు, కంపోస్ట్ యార్డ్‌లో వ్యర్థాల తరలింపు, ఏబీసీ సెంటర్‌లో వీధి కుక్కల ఆపరేషన్లు, అందుకు తగిన ఏర్పాట్లను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డ్రెయిన్‌కి ముందు ఏ విధమైన ఆక్రమణ ఉండడానికి వీలు లేదని, ప్రధానంగా డ్రెయిన్‌పై పూడిక తీయడానికి వీలు లేని ర్యాంప్‌లను కూడా తొలగించాలన్నారు. ఆక్రమణల తొలగింపు ప్రక్రియ అనంతరం వెంటనే పూడిక తీయడం ప్రారంభించాలన్నారు. తొలగించిన ఆక్రమణల వ్యర్థాలను ఎప్పటికప్పుడు లో లెవల్ ప్రాంతాలను గుర్తించి మెరక కోసం తరలించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. డ్రెయిన్ నిర్మాణం అవసరమైన ప్రాంతాల్లో ప్రతిపాదనలు త్వరగా సిద్ధం చేయాలని ఏఈలని ఆదేశించారు. అనంతరం ఏటుకూరు రోడ్ లోని వీధి కుక్కల ఏబీసీ సెంటర్‌ని పరిశీలించి నూతన ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, ఆపరేషన్ అనంతరం పోస్ట్ కేర్ కోసం ప్రత్యేక బోనులు తెప్పించాలని ఈఈని ఆదేశించారు. ప్రతి రోజు కనీసం 150 కుక్కలకు ఏబీసీ చేయడానికి తగిన ఏర్పాట్లు చేయాలని, పశువైద్య విభాగం నుంచి సీనియర్ డాక్టర్‌ని డెప్యూటేషన్‌పై తీసుకురావడానికి ఆ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సీఎంఓహెచ్‌ని ఆదేశించారు. అనంతరం కంపోస్ట్ యార్డ్‌ని పరిశీలించి, ప్రాంగణం శుభ్రంగా ఉంచాలని, వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్‌కి తరలించాలన్నారు. సిబ్బంది హాజరు ఐరిష్ ద్వారా తీసుకోవాలని, యార్డుకు ఎమినిటి కార్యదర్శిని ఇన్‌చార్జిగా నియమించాలని ఈఈని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ సుందర్రామిరెడ్డి, సీఎంఓహెచ్ డాక్టర్ శోభారాణి, ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, ఏసీపీ రెహ్మాన్ పాల్గొన్నారు.

ఇంటింటి స్కిల్ సర్వే పక్కాగా చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న గుంటూరు నగర అదనపు కమిషనర్ ఓబులేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల వారీగా ఇంటింటి స్కిల్ సర్వే పక్కాగా చేసి, ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు తెలిపారు. గుంటూరు నగరంలో యువత నైపుణ్యాలపై చేపట్టనున్న సర్వేపై వార్డు సచివాలయ కార్యదర్శులకు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యువత నైపుణ్య గుర్తింపు కోసం ఇంటింటి సర్వేని వార్డు సచివాలయ కార్యదర్శులు చేపట్టాలన్నారు. సర్వేలో ప్రతి ఒక్కరి చదువు, ఉద్యోగం, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం, గతంలో చేసిన ఉద్యోగ సమాచారం తదితర వివరాలు సమగ్రంగా సేకరించి, వివరాల నమోదుకి కేటాయించిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం సర్వే పై స్టేట్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ గోపి కృష్ణ క్షేత్ర స్థాయిలో చేపట్టాల్సిన సర్వే, యాప్‌లో అప్ లోడ్ చేయాల్సిన విధానంపై కార్యదర్శులకు అవగాహన కల్పించారు. కార్యకమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీఓ రామారావు, జిల్లా ఉపాధి అధికారి రమాదేవి, స్కిల్ డెవలప్మెంట్ అధికారి సంజీవరావు, జీఎంసీ కో ఆర్డినేటర్ మనుదీప్ పాల్గొన్నారు.


అక్షరాస్యత శాతాన్ని పెంచాలి

కాకుమాను: అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి జగన్మోహనరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సోమవారం వలంటరీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని నిరక్షరాసులను గుర్తించి వారిని అక్షరాస్యులుగా చేసే విధంగా వలంటరీ టీచర్లు కృషి చేయాలని చెప్పారు. అక్షరాలు నేర్చుకున్న వారు సంతకం చేసే విధంగా వారికి విద్యను అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.యుగకీర్తి, ఏపీఎం సుజాత, ఏసీడీఎస్ సూపర్ వైజర్ వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

చేబ్రోలు: మండలం శేకూరులో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. శేకూరు గ్రామానికి చెందిన జ్వాలా నరసింహరావుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. పది వేల ఆర్థిక సహాయం అందజేశారు. తహసీల్దారు శ్రీనివాసశర్మ, టీడీపీ మండల అధ్యక్షుడు మైలా రామరాజు పాల్గొన్నారు.

గాలి ఆడదు.. గొంతు తడవదు



మరమ్మతులకు నోచుకుని విద్యుత్ స్విచ్ బోర్డు



పట్టణంలోని గుంటూరు బస్ స్టాప్



తిరగని ఫ్యాన్లలో అవస్థలు

బస్ స్టాప్‌లో సమస్యలతో ప్రయాణికుల అవస్థలు

పొన్నూరు: పట్టణం ఐలాండ్ సెంటర్‌లోని బస్ స్టాప్‌లో సౌకర్యాల లేమి ప్రయాణికులను అవస్థలకు గురిచేస్తోంది. కొన్ని నెలలుగా ఫ్యాన్లు తిరగడం లేదు. సమయం తెలుసుకునేందుకు గడియారం లేదు. కనీసం తాగునీరు కూడా ఏర్పాటు చేయడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. టాయ్‌లెట్లు కూడా అపరిశుభ్రంగా ఉంటున్నాయని, డబ్బులు అధికంగా వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రయాణికుల సౌకర్యార్థం మున్సిపల్ నిధులు సుమారు రూ.10 లక్షలతో బస్ స్టాప్‌ను నిర్మించారు. ప్రారంభంలో ఉన్న సౌకర్యాలు ప్రస్తుతం కనిపించడం లేదు. కొంతకాలంగా బస్‌స్టాప్‌లో సమస్యలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా, అటు ఆర్టీసీ అధికారులు, ఇటు మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటీవల విద్యుత్ స్విచ్ బోర్డు కాలిపోయింది. దీంతో 4 ఫ్యాన్లు కొంతకాలంగా తిరగకపోవడంతో ప్రయాణికులు గాలి ఆడక ఇబ్బందులు పడుతున్నారు. తాగేందుకు మంచినీరు కూడా ఉండటం లేదు. విద్యుత్ బిల్లు తగ్గించుకునేందుకే కాలిన బోర్డుకు మరమ్మతులు చేయించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి బస్ స్టాప్‌లో సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్టీసీ డిపో మేనేజరు అజిత కుమారి మాట్లాడుతూ బస్ స్టాప్ పర్యవేక్షణ మున్సిపాలిటీ పరిధిలో ఉందని, సమస్యలను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు.

ఘనంగా కార్తిక దీపోత్సవం



బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో దర్శనం

చేబ్రోలు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కాక మాసంలోని మొదటి సోమవారం సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చేబ్రోలులోని నాగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థానంలో శివలింగాకారంలో కార్తిక దీపోత్సవం జరిగింది. ఏకాదశి రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన తదితర కార్యక్రమాలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వివిధ ఆలయాల్లో భక్తులు, మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు.

ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తుకు ఇక్కడ ప్రత్యేక నిబంధనలు

- అవస్థలు పడుతున్న పట్టభద్రులు
- ఆసక్తి చూపని అర్హులు

చేబ్రోలు: గ్రాడ్యుయేట్స్ ఓటు హక్కు నమోదుకు సమయం దగ్గరకు వచ్చింది. ఇప్పటికే తగిన సంఖ్యలో దరఖాస్తు చేసుకోలేదు. దీనికి తోడు ఎన్నికల సంఘం కొన్ని నిబంధనలు పెడితే చేబ్రోలు మండలంలోని రెవెన్యూ అధికారులు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ప్రత్యేక ని'బంధనా'లు పెట్టి ఓటర్లను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

చేబ్రోలు మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలో వేలాది మంది గ్రాడ్యుయేట్‌లు ఓటు హక్కు కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు ఎన్నికల కమిషన్ స్వీకరిస్తుంది. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లోని దరఖాస్తుల స్వీకరణకు అధికారులు సవాలక్ష ఆంక్షలు పెడుతుండటంపై పలువురు జిల్లా ఉన్నతాధికారులకు, మీడియా ప్రతినిధుల దృష్టికి తమ గోడును వెల్లబోసుకుంటున్నారు.

ఎంపీడీవో లేక కళాశాల ప్రిన్సిపాల్ మాత్రమే గెజిటెడ్

డిగ్రీ సర్టిఫికెట్‌పై అటెస్టెడ్ సంతకంగా గెజిటెడ్ సంతకం చేయాల్సి ఉండటంతో దానికి మండలంలోని ఎంపీడీఓ లేక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాత్రమే గెజిటెడ్ సంతంకాన్ని అంగీకరిస్తున్నారు. మిగిలిన గెజిటెడ్ అధికారుల సంతకం చెల్లదని రెవెన్యూ అధికారులు దరఖాస్తుదారులను వెనక్కి పంపిస్తున్నారు. డిగ్రీ కళాశాల అధ్యాపకులు, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఇతర మండల స్థాయి అధికారులు గెజిటెడ్ అధికారిగా ప్రభుత్వం గుర్తించినప్పటికి ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తుకు చెల్లదని చెప్పటంపై ఓటు హక్కు దరఖాస్తు దారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు సర్టిఫికెట్లు కావాలంటా..

గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలంటే చేబ్రోలు మండలంలో ఆరు సర్టిఫికెట్లు అందజేయాలని అధికారులు ఆంక్షలు పెట్టారు. దీంతో దరఖాస్తు చేసుకోవటానికి గ్రాడ్యుయేట్లు ఎన్నికల్లో ఓటు హక్కు దరఖాస్తు చేసుకోవటానికి వెనుకంజ వేస్తున్నారు. ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తులు కోసం ఓటర్లు కార్యాలయంలోని సిబ్బందిని అడిగితే లేవని చెబుతున్నారు. బయట షాపులో తీసుకొని దరఖాస్తు చేసుకోండనే సమాధారం ఇస్తున్నారు. ఓటు హక్కు కావలంటే డిగ్రీ సర్టిఫికెట్టుపై గజిటెడ్ సంతకంతో దరఖాస్తు చేస్తే సరిపోతుంది. చేబ్రోలులో అధికారులు మాత్రం టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫొటో, ఓటరు కార్డు, ఆదార్ కార్డు జిరాక్స్‌లపై గెజిటెడ్ సంతకంతో దరఖాస్తు చేయాలని ఆంక్షలు విధించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలనలో అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు కావాలని చెప్పటంపై విమర్శలు వస్తున్నాయి. చేబ్రోలు మండలంలో ఇప్పటి వరకు ఆఫ్‌లైన్‌లో కేవలం 150 మాత్రమే దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దారు శ్రీనివాసశర్మ తెలిపారు. దీనిపై తహసీల్దారును వివరణ కోరగా పరిశీలన అనంతరం ఆన్‌లైన్‌లో డేటా నమోదుకు డేటా ఆఫ్ బర్త్ ఇతర వివరాలు ఎంటర్ చేయాల్సి ఉందని చెప్పారు.

ఔషధ వినియోగంపై అవగాహన



అతిథులను సన్మానిస్తున్న కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో రెండు రోజుల ఇంటరాక్టివ్ సెషన్ ఆన్ ప్రీ క్లినికల్ ఫార్మాకాలజీ అండ్ ఫార్మాకోవిజిలెన్స్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రిటైర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ ఆర్ఎస్ ఠాకూర్ మాట్లాడుతూ ఔషధ నామకరణం ఒక సమగ్ర ప్రక్రియ అని, దీని ద్వారా ప్రతి ఔషధం యొక్క ప్రత్యేకతను నిర్ధారించడమే కాకుండా దాని అభివృద్ధి, నియంత్రణ ఆమోదం వైద్య వినియోగంలో దాని గుర్తింపు సులభతరం చేస్తుందన్నారు. ఔషధ అన్వేషణలో సంశ్లేషణాత్మక (కన్సెప్చువల్) దృక్పథాలు వివిధ రకాల నూతన ఔషధాలను అభివృద్ధి చేయడంలో కీలకంగా ఉంటాయన్నారు. వివిధ సూత్రాలను ఉపయోగించి ఔషధాల ప్రాథమిక ఆవిష్కరణ, అభివృద్ధి, పరీక్షకు మార్గదర్శకాలు కల్పిస్తాయని చెప్పారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు అధ్యక్షత వహించారు. అతిథులను చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు సన్మానించారు.

గ్రామాల్లో నిరుద్యోగులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ యుగకీర్తి

కాకుమాను: మండలంలోని డిగ్రీ, పీజీ వరకు చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారిని గుర్తించాలని ఎంపీడీఓ కె.యుగకీర్తి అన్నారు. స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థాన కళ్యాణ మండపంలో సోమవారం మండలంలోని 13 గ్రామ సచివాలయ సిబ్బందికి ప్రజా ప్రతినిధుల సమన్వయంతో స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ మండలంలోని గ్రామాలలో పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ వరకు చదువుకుని నిరుద్యోగులుగా ఉన్న వారి వివరాలను సేకరించాలని సూచించారు. అదే విధంగా డిగ్రీ పూర్తి చేసుకున్న వారిని గుర్తించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకునే విధంగా వారికి అవగాహన కల్పించాలని కోరారు. బుధవారంతో ఓటు హక్కు గడువు పూర్తవుతుందని వెంటనే దరఖాస్తు చేయని వారిని గుర్తించాలని ఆదేశించారు. తహసీల్దార్ వెంకటస్వామి, ఎంఈఓ విజయ్ భాస్కర్ పాల్గొన్నారు.